క్లుప్తంగా

పాడె మోసిన మాజీ స్పీకర్



శాయంపేట : మండలంలోని పెద్ద కోడెపాక గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, తెలంగాణ ఉద్యమకారుడు పెంచాల ఆగయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి శనివారం ఆగయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు రవీందర్, నాయకులు రమేశ్, మహేందర్, విజయ్, గణేశ్, గౌస్, రాకేష్, మహేందర్‌రెడ్డి, సాయికృష్ణ, విజయ్, అశోక్ ఉన్నారు.

మాజీ ఎంపీపీ పరామర్శ

మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పెంచాల ఆగయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ మేరకు మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆగయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మోహన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు పెద్దకోడలు శ్వేత(45) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం శనివారం మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట కుమారస్వామి, ప్రతాప్‌రావు, సంపత్‌రావు, రాజు ఉన్నారు.

గంజాయితో పట్టుబడిన యువకుడి అరెస్ట్

వేలేరు : గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై అజ్మీరా సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరు పోలీస్‌లు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి చేసిన తనిఖీల్లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన మాటూరి తరుణ్ అనే యువకుడు శుక్రవారం రాత్రి వేలేరు బస్టాండ్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతూ పోలీస్‌లను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన పోలీస్‌లు తరుణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అతడి వద్ద రూ.11,250 విలువ గల 410 గ్రాముల గంజాయి, రూ.8,900 నగదు, ఒక సెల్ ఫోన్ లభించినట్లు తెలిపారు. వెంటనే యువకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



దామెర : మండలంలోని ల్యాదెళ్ల సమీపం గుట్ట నుంచి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి తెలిపారు. నాలుగు ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

నేడు ఓరుగల్లు జానపద స్వరాల జల్లు

హన్మకొండ కల్చరల్: వరంగల్ జేబీ కల్చరల్ సొసైటీ 25 వసంతాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఓరుగల్లు జానపద స్వరాలు ఆటపాటల జాతర -2024 కార్యక్రమాన్ని హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడల శివ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాకారులకు వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి స్మారకంగా కీర్తి పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

17న పూర్వ విద్యార్థుల సమావేశం

హన్మకొండ కల్చరల్: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1972 – 75 సంవత్సరంలో డిగ్రీ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నవంబర్ 17న నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థులు మహ్మద్ సిరాజుద్దీన్, నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99497 10085, 98494 32616 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

వైద్య శిబిరం

మడికొండ: మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కడిపికొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సంతోష్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడేళ్లుగా మూలుగుతూనే..

- అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణం
- సంవత్సరాలుగా నిలిచిన పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- నిధులు లేకపోవడమే కారణం..



మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీహాల్ భవనం

వేలేరు : మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం మూడేళ్లు గడుస్తున్నా పూర్తిచేయడం లేదని మండలంలోని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఎస్సీ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన సంబంధిత కాంట్రాక్టర్ పిల్లర్లు, స్లాబ్, సగం వరకు గోడలు నిర్మించాడు. అయితే బిల్లులు రావడం లేదనే కారణంతో పనులను మధ్యలోనే వదిలేశాడు. అప్పటి నుంచి నేటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నచందంగా మారింది. కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజాప్రతినిధులకు ,అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దళితుల అభ్యున్నతికి ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా అవి పూర్తిస్థాయిలో అమలు అవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకుని మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు. నిధులు మంజూరుకు కృషి చేయాలంటున్నారు.

శంకుస్థాపనతోనే సరి..

మండల కేంద్రంలో మూడేళ్ల క్రితం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే రాజయ్య శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్ స్లాబ్ వేసి, సగం వరకే గోడలు కట్టి బిల్లులు రావడం లేదని వదిలేశాడు. ఇప్పటికైనా ప్రస్తుత ఎమ్మెల్యే నిధులు విడుదల చేయించి పనులు పూర్తిచేయాలి.

\- శంకరయ్య, సీపీఐ మండల కార్యదర్శి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీఐ పులి రమేశ్



మాట్లాడుతున్న సీఐ రమేశ్

ఎల్కతుర్తి : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ పులి రమేశ్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని దామెర గ్రామంలో స్థానిక ఎస్సై గోదారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ జాగృతి కళాజాత బృందం సైబర్ నేరాలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సీఐ రమేశ్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలు, ఓటీపీ, ఆధార్ నంబర్ వంటి వివరాలు అడిగితే చెప్పొద్దని అన్నారు. బ్యాంక్ అధికారులు ఫోన్ చేయరని, వ్యక్తిగత వివరాలు అడగరని అన్నారు. అలాగే యువత గంజాయి, మత్తు పదార్థాలు, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి విక్రయించినా, సేవించినా 8712584473 నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, డయల్100, సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పించారు. వృద్ధ తల్లిదండ్రులను కష్టపెట్టకుండా చూసుకోవాలని, మూఢ నమ్మకాలను నమ్మొద్దని నాటిక ప్రదర్శించారు. సైబర్ క్రైం మోసాలను తెలుపుతూ 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌ను వివరించారు. హెడ్ కానిస్టేబుల్ విఠల్, బక్కయ్య, కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దళిత వాడలను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న మంద సంపత్

ఐనవోలు : జిల్లాలోని ప్రతీ దళిత వాడను అభివృద్ధి చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి గబ్బెట రామ్‌కుమార్, సింగారం దాస్ అధ్యక్షతన మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతీ దళిత వాడను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో దళితులు ఏదో రకమైన వివక్షకు గురవతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు, కులం పేరుతో దూషించడం, ప్రేమ వివాహాలు చేసుకుంటే హత్యలు చేయడం బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎక్కువయ్యాయని ఆరోపించారు. దిశ, నిర్భయ తదితర చట్టాలను తీసుకొచ్చినా కేసుల విచారణ త్వరితగతిన పూర్తవడం లేదన్నారు. కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు శీలం శ్రీను, రిపిక అజయ్, విజయ్, సుధాకర్, నాగరాజు, శరత్, భరత్, కుమార్, దేవనాదం, భాస్కర్ పాల్గొన్నారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి చేయూత



కమలాపూర్ : తమతో కలిసి చదువుకున్న బాల్యమిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు చేయూతనిచ్చి అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన అట్ల చంద్రమౌళి తల్లిదండ్రులు ఇటీవల మృతిచెందారు. వారి మృతితో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నారనే విషయం తెలుసుకున్న 1994–95లో చంద్రమౌళితో కలిసి పదోతరగతి చదువుకున్న బాల్యమిత్రులు బాధిత కుటుంబానికి శనివారం 50 కిలోల బియ్యంతో పాటు రూ.28 వేల నగదును ఆర్థికసాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, శివకుమార్, సంపత్, శోభన్‌బాబు, మహేందర్‌రెడ్డి, పున్నంచందర్, కుమారస్వామి, సుధాకర్, లింగయ్య, లక్ష్మణ్, చంద్రశేఖర్, పున్నంచందర్, రాజ్‌కుమార్, సతీష్, రమేశ్ పాల్గొన్నారు.

అండగా నిలిచిన ఆర్యవైశ్యులు

పరకాల : పట్టణంలో రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు అంచూరి ప్రదీప్ కుటుంబానికి పరకాల ఆర్యవైశ్య ప్రముఖులు, ఎరువుల షాపు డీలర్లు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. వరంగల్, పరకాల ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆర్యవైశ్యుల సహకారంతో ప్రదీప్ కుమార్తె పేరిటా రూ.3లక్షల 39వేలను పరకాల పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు. డిపాజిట్ చేసిన పాస్‌బుక్కును ప్రదీప్ భార్య ప్రియాంకకు అందించారు. వాసవి కన్యాకపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం పరకాల మండల అధ్యక్షుడు సదానందం, జిల్లా కోశాధికారి రవీందర్, నాయకులు లక్ష్మణ్, రవీందర్, సతీష్ పాల్గొన్నారు.

'వాగ్దేవి'కి ఐఎస్ఓ సర్టిఫికెట్

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలకు ఐఎస్ఓ 21001 – 2018 గుర్తింపు పొందింది. విద్యారంగంలో వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల పాటిస్తున్న స్టాండర్డ్స్ గుర్తించిన హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్.. ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సీహెచ్ దేవేందర్‌రెడ్డికి ఆ సంస్థ ప్రతినిధి శివరామయ్య సర్టిఫికెట్ అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వాహిణిదేవి, వైస్ ప్రిన్సిపాల్ హరీందర్ రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

కాజీపేట: రైల్వే రిటైర్డ్ కార్మికులకు మెరుగైన వైద్యం అందించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంగమయ్య కోరారు. కాజీపేట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మూడో త్రైమాసిక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. రైల్వే ఆస్పత్రిలో మహిళా వైద్యురాలిని నియమించాలని సభ్యులు ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో సంఘం కార్యదర్శి కేవీ.రావు, కె.అయిలయ్య, బి.యాదయ్య, రాములు, వెంకటేశ్వర్లు, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని రూపుమాపాలి



ఓంకార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శాయంపేట : దేశంలో పేట్రేగిపోతున్న మతోన్మాద దోపిడీ విధానాలను రూపుమాపేందుకు ప్రత్యామ్నాయం మార్క్సిజం, అంబేడ్కర్ ఆలోచన విధానమే మార్గమని ఎంసీపీఐ (యూ) కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఎంసీపీఐ(యూ) పరకాల డివిజన్ కార్యదర్శి నీల రవీందర్ అధ్యక్షతన ఎంసీపీఐ (యూ) వ్యవస్థాపకుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. సీనియర్ సభ్యులు చిలుకల రాజన్న, నాలికె రాజమౌళి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రస్తుత రాజకీయాలు, మార్క్సిజం, అంబేడ్కర్ ఆలోచన విధానం అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 77 సంవత్సరాల స్వాతంత్ర భారతదేశంలో ఆకలి, నిరుద్యోగం, ఆత్మహత్యలు, అత్యాచారాలు, హింసతో పాటు కుల, మత బేధాలు, ప్రాంతీయ తత్వాలను పాలకవర్గాలు అనైతిక రాజకీయ విధానాలతో పెంచి పోషిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో మూడోసారి కేంద్రాన్ని పాలిస్తున్న బీజేపీ కూడా తన మత భావాజాలన్ని పెంపొందించుకుంటూ మైనారిటీలపై, దళిత, గిరిజన అట్టడుగు వర్గాలపై మనువాద పాలన పేరుతో దాడులకు పూనుకుంటుందని ఆరోపించారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు దేశ సంపదను కట్టబెడుతోందని విమర్శించారు. మార్క్సిజంతోనే మతోన్మాదాన్ని రూపుమాపొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి హంసారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాస్ సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు బుచ్చయ్య, భద్రయ్య, కిషన్, రమేశ్, ప్రభాకర్‌రావు, రాజేశ్వరరావు, ఇంద్రారెడ్డి, రవీందర్, వెంకటేశ్వర్లు, సునీల్, అనిల్, బాబురావు, సమ్మయ్య, రంజిత్, రాజమౌళి, సదానందం, మల్లయ్య, సతీష్, శంకర్ ఉన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ధర్మసాగర్ : విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంగళ మురళి అన్నారు. హనుమకొండలోని సుబేదారిలో గల అంకం నిలయంలో శనివారం ఇగ్నైటెడ్ మైండ్స్ ఉపాధ్యాయ కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పదోన్నతి పొందిన 11 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. దసరా సెలవుల్లో కర్ణాటక రాష్ట్రానికి 8 రోజుల పాటు విహారయాత్రకు వెళ్లిన సంస్థ సభ్యులు యాత్ర అనుభవాలను పంచుకొని ఆత్మీయ సామూహిక బంతి భోజనాలతో ఆహ్లాదంగా గడిపారు. విద్యార్థుల దృష్టిని చదువుపై మళ్లించడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, వీరరాఘవ, శ్రీధర్, రచయిత్రి, గాయని కిరణ్మయి, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, విజయలక్ష్మి, అనుపమ, జగన్‌మోహన్, కిరణ్మయి, అరుణ, స్వప్న, సర్వర్, అష్రాఫ్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేణు, ఉపాధ్యాయులు ధర్మప్రకాశ్, సంపత్ కుమార్, మహేశ్వర్, సందీప్, సదానందీశ్వర్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎల్కతుర్తి : గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్, వరంగల్ నేషనల్ హైవే పనుల్లో భాగంగా మండల కేంద్రానికి చెందిన గీత కార్మికులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ఎక్సైజ్ శాఖకు తెలపకుండా కల్లు పారే తాటి, ఈత చెట్లను తొలగించి గీత కార్మికుల జీవనాధారాన్ని దెబ్బతీశారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుస్తులకు, రోడ్డు కాంట్రాక్టర్లకు కొంతమంది రాజకీయ నాయకులు అండగా నిలిచి అగ్రవర్ణాల భూములను కాపాడుకునేందుకు గీత కార్మికుల తాటి, ఈత చెట్లను తొలగించారని ఆరోపించారు. ఈ సమస్యపై గీత కార్మికులు సమిష్టగా ఉండి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గీత కార్మికులకు జరిగిన నష్టానికి హైవే రోడ్డు కాంట్రాక్టర్ వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బెల్ట్‌షాపులను వెంటనే మూసివేయాలని, గీత కార్మికులకు సేఫ్టీ మోకుల అందించి ట్రైనింగ్ క్యాంపు ప్రారంభించాలని కోరారు. అలాగే ద్విచక్ర వాహనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఎక్స్‌గ్రేషియా కింద 10లక్షలు, వికలాంగులకు 5లక్షలు, గీత కార్మికుల పింఛన్ రూ. 4వేలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ సమావేశంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనారాయణ, రాజేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'పొలం బాట'తో సమస్యల పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న ఏడీఈ వంశీకృష్ణ

కమలాపూర్ : పొలం బాట కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకుని వ్యవసాయ విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలని విద్యుత్ శాఖ ఏడీఈ వంశీకృష్ణ సూచించారు. మండలంలోని పంగిడిపల్లిలో ఉప్పల్ సెక్షన్ ఆధ్వర్యంలో శనివారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ విద్యుత్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని, తద్వారా ఓవర్ లోడ్, లో ఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. అదే విధంగా స్వచ్ఛందంగా తమ మోటార్లకు అమర్చుకున్న ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగించుకోవాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సెక్షన్ ఏఈఈ సంపత్‌రెడ్డి, లైన్‌మెన్ రమేశ్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'డీఎస్పీ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి'



మహాసమ్మేళన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్, నాయకులు

కమలాపూర్ : నవంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) కార్యకర్తల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని డీఎస్పీ రాష్ట్ర నాయకుడు, కరీంనగర్ జిల్లా రీజనల్ ఇన్‌చార్జ్ చిలువేరు శ్రీకాంత్ మహారాజ్ పిలుపునిచ్చారు. ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళన కార్యక్రమం కరపత్రాలను మండల కేంద్రంలో శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 90 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్య, వైద్యం, భూమి, ఇల్లు, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఐదు అంశాలపై ధర్మ సమాజ్ పార్టీ ధర్మయుద్ధం చేపట్టబోతుందని అన్నారు. అనంతరం ఆ పార్టీ మండల కన్వీనర్‌గా కుమ్మరి రాజును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కార్యదర్శి సోమిడి నరేష్, నాయకులు గట్టుమల్లు, శివాజీ, కుమార్, అనిల్, ప్రశాంత్, వినయ్, మహేష్, శ్రీరాం, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

టీపీటీఎఫ్ కమిటీ ఎన్నిక

వేలేరు : టీపీటీఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా గంటే సదయ్య, ప్రధానకార్యదర్శిగా హరిలాల్, ఉపాధ్యక్షుడిగా వెంకటస్వామి, ఆసియా సుల్తానా, కార్యదర్శులుగా రమేశ్, సునిత, జిల్లా కౌన్సిలర్లుగా సత్తార్, సదానందాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

అనుమతి తప్పనిసరి

దామెర : దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటు కోసం నిర్వాహకులు ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఎస్సై కొంక అశోక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ముందస్తు అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేత



శాయంపేట : మండలంలో విచ్చలవిడిగా వెలసిన బెల్ట్‌షాపులను అరికట్టాలని బీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్ పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీకి శనివారం వినితిపత్రం అందించారు. గ్రామాల్లో వెలసిన బెల్ట్‌షాపులు యువకులను మత్తుకు బానిస చేస్తూ వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్నాయన్నారు.

హింసారహిత సమాజమే లక్ష్యం

పరకాల : మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న హింసను నివారించి హింసారహిత సమాజమే లక్ష్యంగా పనిచేస్తామని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ స్పష్టం చేశారు. పట్టణంలో శనివారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా సహాయత కమిటీ సభ్యులకు లింగాధారిత హింసపై శిక్షణ ఏర్పాటు చేసి మాట్లాడారు. జాతీయ నేరా పరిశోధన సంస్థ గణంకాల ప్రకారం ప్రతీ ముగ్గురు మహిళలో ఇద్దరు హింసకు గురవుతున్నారని అన్నారు. నిమిషానికో లైంగిక వేధింపు, 27 నిమిషాలకు ఒక వరకట్న వేధింపు, 57 నిమిషాలకు ఒక అక్రమ రవాణాకు గురవడం ఆందోళనకర విషయమన్నారు. ఆడపిల్లల ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్య పరుస్తూ ఆడ, మగ సమానమనే భావన అందరిలో తీసుకుచ్చేందుకు సర్వోదయ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, ఫీల్డ్ అధికారి రవీందర్, క్లస్టర్ కో ఆర్డినేటర్ శ్రీలత, మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు రాధా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు రాక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జస్వంత్, రాకేష్‌రెడ్డి, గణేష్, అభిషేక్, సాయిసందీప్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఖిలా వరంగల్: ఫార్మసీ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఫార్మసీ కళాశాల యూఎస్ఏ ప్రొఫెసర్ డాక్టర్ ఎరిన్ డ్రగ్, ప్రొఫెసర్ డాక్టర్ వెంకట కశ్యప్ సూచించారు. వరంగల్ ఉర్సు గుట్ట తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో డైరెక్టర్లు డాక్టర్ అరుణ్, వైష్ణవి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్, క్లీనికల్ ఫార్మసీ అండ్ రెగ్యులేటరీ అఫైర్స్ అనే అంశంపై అంతర్జాతీయ అవగాహన సదస్సు జరిగింది.

క్రీడా మైదానం క్లీన్



ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామంలో గల క్రీడా మైదానం పిచ్చిమొక్కలతో నిండుకున్న విషయం తెలిసిందే. కాగా 'నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం' అనే శీర్షికన శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి క్రీడా ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించారు. ఫిట్‌నెస్ కోసం ఫిజికల్ ఎక్సర్‌సైజ్‌లు, వాకింగ్ చేసేవారు సైతం గ్రౌండ్ చదునుకావడంతో సంతోషం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..